క్లుప్తంగా

అంగన్‌వాడీ పట్టణ సీడీపీఓగా కె.నిర్మలాదేవి



ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణం అంగన్వాడీ సీడీపీఓగా కె.నిర్మలదేవిని ప్రభుత్వం నియమించింది.ఇక్కడ సీడీపీఓగా పని చేస్తున్న ఎస్‌ఎన్. ఉమా మహేశ్వరి గత నెల రోజులుగా మెడికల్ సెలవులో వెళ్లారు. తిరిగి ఎప్పుడు జాయిన్ అవు తుందో తెలియని పరిస్థితి. ఈ స్థితిలో ప్రభు త్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా చంటి పిల్ల లు, బాలింతలు, గర్భిణుల కోసం అందించే బాలమృతం, టేక్ హోం రేషన్ తదితర పౌష్టికాహార కిట్ల పంపిణీలో పర్యవేక్షణ కొరవడుతోంది. దీంతో అధికారులు చర్యలు చేపట్టి ఆస్పరి సీడీపీఓగా పనిచేస్తున్న కె.నిర్మలాదేవిని ఆదోని పట్టణం అంగన్వాడి సీడీపీఓగా(ఎఫ్ఏ) నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఆమె సీడీపీఓగా బాధ్యతలను చేపట్టారు.

ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభలు

పెద్దకడబూరు: 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని అన్ని గ్రామాల్లో పనులు గుర్తిస్తున్నామని ఏపీఓ రామన్న తెలిపారు. అన్ని గ్రామాల్లో గ్రామ సభలను ఏర్పాటు చేసి పనులను గుర్తిస్తామన్నారు. బుధవారం మండల పరిధిలోని బసలదొడ్డి, హెచ్.మురవణి, ముచ్చగిరి, మేకడోణ, తారాపురం, కల్లుకుంట గ్రామాల్లో పనులు గుర్తించడానికి గ్రామ సభలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తమ పొల్లాల్లో పనులు కావాల్సిన రైతులు గ్రామ సభల్లో పాల్గొని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉపాధి పనులను సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరుల మధ్య గుర్తిస్తామన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడదాం

ఆదోనిరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల ప్రజలకు ఎదురవుతున్న సమస్యలపై అక్టోబర్ 1 నుంచి నవంబర్ 7వ తేదీ వరకు సీపీఎం ఆధ్వర్యంలో సమరశంఖం కార్యక్రమం చేపట్టినట్లు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.వెంకటేశులు, మండల కార్యదర్శి కె.లింగన్న తెలిపారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. సీపీఎం మండల నాయకులు అయ్యప్ప, బాషా, చిన్నతిక్కన్న, తిక్కప్ప తదితరులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలు వీడాలి

కోసిగి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మహాత్మ గాంధీ జయంతి పురస్కరించుకుని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'మూఢ నమ్మకాలు వీడాలి' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పలువురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచినట్లు హెచ్‌ఎం ఖలీల్ అహ్మద్ తెలిపారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బుధవారం ప్రశంసా పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. గాంధీ చూపిన సత్యం, అహింస మార్గంలో నడుచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాల పంపిణీ



విరుపాపురంలో సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు అరుణమ్మ

ఆదోనిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడమే గాకుండా సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను పంపిణీ చేస్తున్నారని ఆదోని జెడ్పీటీసీ సభ్యురాలు అరుణమ్మ, విరుపాపురం సర్పంచ్ ప్రహ్లాద్‌యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం తమ గ్రామంలో 60 మంది రైతులకు సబ్సిడీ పప్పుశనగ విత్తనాలను అందించారు. జెడ్పీటీసీ, సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి



నదిచాగిలో ఈ-క్రాప్ జాబితాను పరిశీలిస్తున్న రైతన్నలు

కౌతాళం: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు ప్రభుత్వ రాయితీలు పొందేందుకు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి శేషాద్రి సూచించారు. ఇంకా ఈ-కేవైసీ చేయించుకోని రైతుల జాబితాను బుధవారం గ్రామాల్లోని ఆర్బీకే నోటీసు బోర్డుల మీద అతికించినట్లు తెలిపారు. రైతులు సంబంధిత వ్యవసాయాధికారుల వద్ద గానీ అందుబాటులో ఉన్న వలంటీర్ల వద్ద గానీ ఈ-కేవైసీ చేయించుకోవాలని కోరారు. వలంటీర్ల లాగిన్‌లో కూడా ఈ-కేవైసీ చేయించుకునేలా అవకాశం కల్పించామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం



దొడ్డనగేరిలో గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్



కాచాపురంలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి



కంబదహాల్‌లో వైద్య సేవలందిస్తున్న సిబ్బంది



కోసిగిలో వైద్యసేవలందిస్తున్న దృశ్యం



కోసగిలో పౌష్టికాహార స్టాల్‌ను పర్యవేక్షిస్తున్న అధికారులు, నాయకులు

ఆదోనిరూరల్: ప్రజారోగ్య పరిరక్షణే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని, గ్రామస్థాయిలో ప్రతిఒక్కరికీ వైద్యసేవలు అందేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసుకున్నారని ఆదోని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని దొడ్డనగేరి గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పేద ప్రజలకు అండగా గ్రామస్థాయిలోనే ప్రభుత్వం వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి అన్నిరకాల జబ్బులకు చికిత్సలు అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో వైద్యులు శాంతిజ్యోతి, వైష్ణవిరాణి, హరీష్‌కుమార్ తదితరులు 300 మందికి పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ మధుసూదన్, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, డాక్టర్ శాంతిజ్యోతి, డీటీ రజనీకాంత్‌రెడ్డి, నాయకులు కామాక్షి తిమ్మప్ప, విశ్వనాథ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

మంత్రాలయం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కాచాపురం గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన శిబిరంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్ రెడ్డి పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలని సాగిస్తున్నారని కొనియాడారు. పల్లెల్లో వైద్య విప్లవం తెచ్చేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. శిబిరంలో వైద్య సేవలను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం మాత శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. ఎమ్మెల్యే వారిని ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమారెడ్డి, ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, వైద్యులు భావన, వసంత, ఎంపీడీఓ మణిమంజరి, తహసీల్దార్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో అన్ని వ్యాధులకు వైద్య సేవలందిస్తున్నట్లు డాక్టర్లు బాలకృష్ణ, రవిచంద్ర, సుస్మిత పేర్కొన్నారు. మండల పరిధిలోని కంబలదిన్నె గ్రామంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించిన 294 మందికి వైద్య సేవలందించారు. వారిలో మెరుగైన పరీక్షల నిమిత్తం ఐదుగురిని కర్నూలుకు రెఫర్ చేశారు.

నేడు హనుమాపురంలో వైద్య శిబిరం

మండల పరిధిలోని హనుమాపురం గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ శాంతిజ్యోతి పేర్కొన్నారు. గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కోసిగి: మండల కేంద్రంలోని 3వ సచివాలయం పరిధిలోని హిందూ బాలికల ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో డాక్టర్ మనోజ్ కుమార్ సమక్షంలో వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ కుమారి అయ్యమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు నాడుగేని నాగరాజు శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో ఓపీ ద్వారా దాదాపు 364 మందికి డాక్టర్లు వైద్య సేవలందించారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని ఆరోగ్య శ్రీ కింద కర్నూలుకు రెఫర్ చేశారు. అలాగే కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు అందించారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్ క్యాతాయిని ఆధ్వర్యంలో సిబ్బంది పౌష్టికాహార స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. కోసిగి పీహెచ్‌సీ వైద్యాధికారులు నజీర్ అహ్మద్, అభిరూప్, రజిత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



దొడ్డనగేరిలో వైద్యసేవల కోసం క్యూలో వస్తున్న ప్రజలు

షుగర్ పరీక్షలు చేయించుకున్నా



నాకు 20 ఏళ్లుగా షుగర్ ఉంది. మాత్రలు వాడుతున్నాను. అయినప్పటికీ తగ్గడం లేదు. ప్రతినెలా రూ.వెయ్యి ఖర్చు చేసి ఆదోనికి వెళ్లి డాక్టర్ వద్ద పరీక్షలు చేయించుకుని మందులు కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నా. గ్రామంలో ఉచితంగా షుగర్ పరీక్షలు చేసి, చికిత్స అందిస్తారని చెప్పడంతో సంతోషం కలిగింది. ఈ రోజు వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుని, నెలకు సరిపడే మాత్రలను ఉచితంగా తీసుకున్నాను.

– వెంకటేష్, దొడ్డనగేరి గ్రామస్తుడు

బీపీ, షుగర్‌కు మందులు ఇచ్చారు



నేను బీపీ, షుగర్, దగ్గు, కంటి సమస్యలతో బాధపడుతున్నాను.ఈ రోజు గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో బీపీ, షుగర్, కంటి సమస్య, దగ్గు సమస్యను వైద్యులు పరీక్షించారు. మాత్రలను ఇచ్చారు. ఏమీ భయపడవద్దు తగ్గుతుందని భరోసా ఇచ్చారు. గ్రామంలోనే పరీక్షించి ఉచితంగా మాత్రలు ఇవ్వడం సంతోషంగా ఉంది. ప్రభుత్వం మాలాంటి పేదోళ్ల కోసం గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయం.

– శ్యామలమ్మ, దొడ్డనగేరి గ్రామస్తురాలు

ప్రజా మద్దతు జగనన్నకే..



దొడ్డనగేరిలో సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్: 2024లో సంక్షేమ పార్టీ, అవినీతి పార్టీకి మధ్య జరిగే ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అఖండ విజయం సాధించడం ఖాయమని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు.ఈ మేరకు బుధవారం రెండో రోజూ దొడ్డనగేరిలో గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 200కు పైగా ఇళ్లను సందర్శించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. నాలుగేళ్ల పాలనలో 98 శాతానికిపైగా హామీలను నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మాజీ సీఎం చంద్రబాబునాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అరెస్టై జైలులో ఉన్నాడని, ఔటర్ రింగ్ రోడ్డు స్కాంలో కూడా శిక్ష అనుభవించాల్సిందేనని చెప్పారు. అవినీతికి పాల్పడిన నారా లోకేష్, పలువురు మాజీ మంత్రులు త్వరలోనే జైలుకు పోతారన్నారు. రాబోవు రోజుల్లో టీడీపీ కనుమరుగు కావడం ఖాయమని, ప్రజలు ఆ పార్టీని నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, డీటీ రజనీకాంత్‌రెడ్డి, డీఈ అల్లాబకాష్, పీఆర్‌ఏఈ మాలిక్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు అభినందన

ఆదోనిరూరల్: ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ రంగంలో బెస్ట్ ట్రైనర్, బెస్ట్ మోటివేషనల్ స్పీకర్‌గా పెర్ఫార్మెన్స్ ఆఫ్ ది ఇయర్–2023 ప్రతిభా అవార్డును విరుపాపురానికి చెందిన అనంత మఠ్రిస్వామి అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆయన్ను ప్రత్యేకంగా అభినందించారు. సర్పంచ్ ప్రహ్లాద యాదవ్, నాగేంద్రస్వామి తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని అడ్డుకోలేరు





మంత్రాలయంలో భారీ ర్యాలీ చేపట్టిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు వై.సీతారామిరెడ్డి

- టీడీపీ నాటకాలను ఎండగడుతూ భారీ ర్యాలీ
- మండలంలో రూ. 89.5 లక్షలతో ప్రభుత్వ భవనాలు ప్రారంభం

మంత్రాలయం: తెలుగుదేశం, ఆ తోక పార్టీలు ఎన్ని అలజడులు సృష్టించినా, రాద్ధాంతాలు చేసినా వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని అడ్డుకోలేరని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు అరెస్ట్‌పై టీడీపీ నేతలు చేస్తున్న ఆరోపణలను నిరసిస్తూ బుధవారం మంత్రాలయంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు. స్థానిక సహకార పరపతి సంఘం నుంచి రాఘవేంద్ర సర్కిల్, సంతమార్కెట్ మీదుగా జెడ్పీ హైస్కూల్ వరకు మోటార్ సైకిళ్లపై ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు టీటీడీ పాలక మండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్‌లో స్కాంలో ప్రజాధనాన్ని లూటీ చేయడంతోనే మాజీ సీఎం చంద్రబాబునాయుడు అరెస్టయ్యారన్నారు. కేంద్ర అవినీతి నిరోధక శాఖ, ఐటీ, జీఎస్టీ శాఖల పరిశీలనలో స్కిల్ స్కాం బయటపడిందన్నారు. రూ.371 కోట్లు అవినీతికి పాల్పడటంతో అరెస్టు చేశారని, ఈ ఘటనను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఆపాదించడం శోచనీయమన్నారు. కనీస అవగాహన లేకుండా టీడీపీ నేతలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రులపై నోరుపారేసుకోవడం విచారకరమన్నారు. టీడీపీ నేతల వాగుడు, కుతంత్రాలు ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, రాబోయె ఎన్నికల్లో టీడీపీ గల్లంతు కావడం ఖాయమన్నారు.

నూతన భవనాల ప్రారంభోత్సవం

గ్రామ స్వరాజ్య స్థాపనలో భాగంగా ప్రభుత్వం నిర్మించిన పలు భవనాలను ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు వై.సీతారామిరెడ్డి ప్రారంభించారు. బుధవారం మండలంలోని చెట్నిహళ్లి గ్రామంలో రూ.24 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, మంత్రాలయంలో రూ.48 లక్షలతో నిర్మించిన సచివాలయం-1, సచివాలయం-2 రైతు భరోసా కేంద్రాలు, రూ.17.50 లక్షలతో నిర్మించిన సచివాలయం-2 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. జాతిపిత మహాత్మా గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల వద్దకు పాలన సాగిస్తున్నారని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమారెడ్డి, ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, సర్పంచులు తెల్లబండ్ల భీమయ్య, అంజి, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు మల్లికార్జున, ఎంపీడీఓ మణిమంజరి, తహసీల్దార్ చంద్రశేఖర్, ఏడీఏ మహ్మద్ ఖాద్రి, ఏఓ గణేష్‌బాబు, డీఎస్పీ సీతారామయ్య, సీఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సచివాలయం ప్రారంభోత్సవం

పెద్దకడబూరు: మండల పరిధిలోని హనుమాపురం గ్రామంలో నూతన సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి గురువారం ప్రారంభిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. అలాగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కూడా పాల్గొంటారని తెలిపారు.

నేటి సురక్ష వైద్య శిబిరాల షెడ్యూల్



వైద్య పరీక్షలు చేసి ఆరోగ్య వివరాలు నమోదు చేసుకుంటున్న ఏఎన్‌ఎం, ఆశావర్కర్

ఆదోని సెంట్రల్: ప్రతి ఒక్కరిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా బుధవారం గ్రామ, పట్టణ ప్రాంతాల్లోని పలు వార్డుల్లో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ప్రజలకు అవగాహన కల్పిస్తూ వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నారు. ప్రజల ఆరోగ్య వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఇంటింటి సర్వే కార్యక్రమం పూర్తయిన గ్రామం, పట్టణ వార్డులలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం నిర్వహించనున్న వైద్య శిబిరాల షెడ్యూల్‌ను అధికారులు ప్రకటించారు.

- ఆదోని మండలం నారాయణపురం గ్రామ సచివాలయంలో డాక్టర్ సుశ్మిత పర్యవేక్షణలో వైద్య శిబిరం జరుగుతుంది.
- కోసిగి మండలం జమ్ములదిన్నే గ్రామంలోని మండల ప్రాథమికోన్నత పాఠశాల అవరణలో డాక్టర్ నజీర్ అహ్మద్ పర్యవేక్షణలో వైద్య శిబిరం
- కౌతాళం మండలం తోవి గ్రామ సచివాలయంలో డాక్టర్ టి.ఇమ్మానియేలు పర్యవేక్షణలో వైద్య శిబిరం
- మంత్రాలయం మండలం బుదూర్ గ్రామ సచివాలయంలో డాక్టర్ ఎం.భావన పర్యవేక్షణలో వైద్య శిబిరం
- ఆదోని పట్టణం ఇందిరానగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో డాక్టరు పి.రవళి యాదవ్ పర్యవేక్షణలో వైద్య శిబిరం నిర్వహించనున్నారు.

ఆదోనిలో విస్తృతంగా కార్డెన్ సెర్చ్



స్వాధీనం చేసుకున్న మద్యం టెట్రా ప్యాకెట్లు, వాహనాలతో త్రీటౌన్ పోలీసులు

ఆదోనిఅర్బన్: పట్టణంలోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న కాలనీల్లో బుధవారం తెల్లవారుజామున డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. త్రీటౌన్ సీఐ నరసింహరాజు, ట్రాఫిక్ సీఐ పార్థసారథి, తాలూకా పోలీసులు, ఎస్‌ఐలు, సిబ్బంది త్రీటౌన్ పరిధిలోని అయా కాలనీల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సెర్చ్‌లో 76 కర్ణాటక టెట్రా మద్యం ప్యాకెట్లు, 58 ప్యాకెట్ల నాటుసారా, ఎటువంటి రికార్డులు లేని పది ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా డీఎస్పీ శివనారాయణ స్వామి మాట్లాడుతూ అనుమానిత ఇళ్లల్లో ఎప్పటికప్పుడు కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రికార్డులు లేని వాహనాలు, అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సీఐలు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించండి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుబ్బరాజు

కౌతాళం: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నిర్దేశించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఎంపీడీఓ సుబ్బరాజు ఆదేశించారు. అయన బుధవారం మండల పరిధిలోని రౌడూరు ప్రాథమిక కన్నడ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రభుత్వం మంచి పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తోందన్నారు. అలాగే ఉపాధ్యాయుల హాజరు పుస్తకం పరిశీలించి ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఓంకార్‌ను పాఠశాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు వెజిటబుల్ రైస్, ఆలు కుర్మా, బాయిల్డ్ ఎగ్, చిక్కీలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. పంచాయతీ కార్యదర్శి అబ్దుల్‌వాహిద్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అఖిల, వెల్ఫేర్ అసిస్టెంట్ మధుసింగ్ వెంట ఉన్నారు.

రెండు బైకులు ఢీ.. ఒకరు మృతి

- మరొకరికి గాయాలు

ఆదోనిఅర్బన్ : పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల సమీపంలో ఎదురెదురుగా రెండు మోటార్ సైకిళ్లు ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా, మరొకరు గాయాపాలయ్యారు. ఈ ఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఆదోని పట్టనం కార్వన్‌పేటకు చెందిన మహ్మద్‌షరీఫ్(45), రజబ్‌లు ఒక బైకుపై బేల్దారి పని ముగించుకొని ఇంటికెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైకు ఢీకొనడంతో మహ్మద్‌షరీఫ్ అక్కడికక్కడే మృతిచెందాడు. రజబ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని వెంటనే స్థానికులు 108 ద్వారా ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన వివరాల మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు మహ్మద్‌షరీఫ్‌కు నలుగురు పిల్లలు ఉన్నారు.

విద్యుత్ తీగలు తగిలి వ్యక్తికి గాయాలు

ఆదోనిఅర్బన్: పట్టణంలోని కల్లుబావి సమీపంలో విద్యుత్ తీగలు తగిలి వ్యక్తికి గాయాలయ్యాయి. వెంటనే సదరు వ్యక్తిని ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ధణాపురం గ్రామ సచివాలయ లైన్‌మెన్ ఉద్యోగి కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కల్లుబావి సమీపంలో విద్యుత్ తీగలకు చెట్లు అడ్డంగా ఉన్నాయని ఎక్కి కొమ్మలను తొలగిస్తుండగా విద్యుత్ తీగలు తగిలి షార్ట్ సర్క్యూట్ వల్ల గాయాలయ్యాయని తెలిపారు.

బాలిక ఆత్మహత్యాయత్నం

మంత్రాలయం: నియోజకవర్గ కేంద్రానికి చెందిన ఓ బాలిక (16) పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. బుధవారం ఎస్‌ఐ వేణుగోపాల్ రాజు తెలిపిన వివరాలు.. మంత్రాలయంకు చెందిన బాలిక స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటోంది. అదే కాలనీకి చెందిన దేవమణి కుమారుడు డానియేల్ బాలికను ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేశాడు. సదరు యువకుడికి ఇటీవల ఆర్మీ ఉద్యోగం రావడంతో బాలికను నిర్లక్ష్యం చేస్తూ వచ్చాడు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక ఉదయం కూల్‌డ్రింక్ పురుగు మందు తాగేసింది. తర్వాత పాఠశాలకు వెళ్లగా ప్రార్థన సమయంలో అస్వస్థతకు గురై కుప్పకూలిపోయింది. ఉపాధ్యాయులు బాలికను కల్లుదేవకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, అక్కడినుంచి ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం అందించారు. ప్రస్తుతం బాలిక సురక్షితంగానే ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. బాలిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌ఎస్ ట్యాంకు పటిష్టత పనులకు ఆమోదం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత

ఆదోనిటౌన్: పట్టణానికి తాగునీటిని అందించే బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకు గట్టు మరమ్మతులకుగానూ అమృత్ 2.0 పథకం కింద మంజూరైన నిధుల కేటాయింపుపై ప్రభుత్వ అనుమతి కోసం కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. పాలకవర్గ సభ్యులు తీర్మానం చేసి మున్సిపల్ డీఎంఏకు నివేదికను సిఫారసు చేయనున్నట్లు చైర్‌పర్సన్ బోయ శాంత, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం చైర్‌పర్సన్ బోయ శాంత అధ్యక్షతన అత్యవసర మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని కొత్త కౌన్సిల్ హాల్‌లో నిర్వహించారు. బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకు చెరువు గట్టు దాదాపు వంద మీటర్ల మేర కుంగిపోయింది. దీంతో తుంగభద్ర దిగువ కాలువ నుంచి నీటి పంపింగ్‌ను నిలిపివేశారు. నీటి సమస్య దృష్ట్యా అత్యవసరంగా మరమ్మతులు చేసేందుకుగానూ అమృత 2.0 పథకం కింద రెండు విడతల్లో మంజూరయ్యే రూ.24.47 కోట్లను మరమ్మతు పనులకు వినియోగించనున్నామని, అందుకుగానూ ప్రభుత్వం అనుమతి ఇవ్వాలంటూ పాలకవర్గసభ్యులు ఆమోదం తెలుపుతూ నివేదికను సిఫారసు చేశారు. మున్సిపల్ జనరల్ ఫండ్స్ రూ.55 లక్షలతో చెరువులోని అంతర్భాగంలో ఇసుక సంచులతో మరమ్మతు పనులు చేయనున్నామని అజెండాను ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదం తెలిపారు. సభ్యుల ఆమోదంతో అత్యవసరంగా చేపట్టబోయే పనులకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. సమావేశంలో కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, ఎంఈ, డీఈలు, పాలకవర్గసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంను చూపుతున్న సెబ్ సీఐ హరిక్రిష్ణ

ఆదోనిరూరల్: పట్టణంలోని భాస్కర్‌రెడ్డి కాలనీ వద్ద బోయ నరసింహులు, స్రవంతి అనే వ్యక్తులు 12 ఓసీ డీలక్స్ విస్కీ కర్ణాటక మద్యం బాక్సులు కలిగి ఉండగా గుర్తించి అరెస్టు చేసినట్లు సెబ్ సీఐ హరిక్రిష్ణ బుధవారం తెలిపారు. అలాగే డీటీఎఫ్ కర్నూలు వారితో కలిసి కౌతాళం మండలం హాల్వి గ్రామంలో దాడులు నిర్వహించగా ఈజాక్, మహబూబ్ అనే ఇద్దరు కర్ణాటక మద్యం బాక్సులను కలిగి ఉండగా అరెస్టు చేసినట్లు చెప్పారు. మూడు కేసుల్లో ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. సెబ్ ఎస్ఐ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



30వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న చైర్‌పర్సన్ బోయశాంత

ఆదోనిటౌన్: ఆదోని అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, యువనేత మనోజ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లులాంటివని చెప్పారు. బుధవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా 25వ వార్డులో గడప గడపకు తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని వారు చెప్పారు.

30వ వార్డులో అభివృద్ధి పనులకు భూమిపూజ

పట్టణంలోని 30వ వార్డులో రూ.30 లక్షలతో సీసీ రోడ్డు, మురుగు కాలువ ఏర్పాటుకు చైర్‌పర్సన్ బోయ శాంత, యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి భూమిపూజ చేశారు. కొన్నేళ్లుగా రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడిన ప్రజలు గత నెలలో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేకు సమస్యను వివరించారు. ఎమ్మెల్యే కృషితో నిధులు మంజూరు కావడంతో బుధవారం రూ.30 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, డీఈ నాగభూషణం రెడ్డి, నాయకులు మహ్మద్‌స్వామి, లక్ష్మణ్, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.